ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

3**

గురువారం 18 జనవరి 2024

రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు 6లో..

యువత వ్యసనాలకు గురికావద్దు 6లో..

ప్రత్యేకపాలన దిశగా పంచాయతీలు?



ఫిబ్రవరి 2తో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం

ప్రత్యేకాధికారుల పాలనకే సర్కారు మొగ్గు

పార్లమెంట్ ఎన్నికల తర్వాతే పంచాయతీ ఎన్నికలు

జిల్లాలో 385 పంచాయతీలు...3,536 వార్డులు

జగిత్యాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల పదవీ కాలం ఫిబ్రవరి 2వ తేదీతో ముగియనుంది. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలపలేదు. దీంతో ఎన్నికలు



నిర్దేశిత గడువులోగా జరగవని తేలిపోయింది. ప్రత్యేకాధికారుల పాలన తప్పనిసరని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ప్రత్యేకాధికారుల నియామకాలకు సంబంధించిన కసరత్తులను పూర్తి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌లలో ఇప్పటికే మండల స్థాయి అధికారుల సమాచారం సేకరించారు.

● జిల్లాలో పెరిగిన పంచాయతీలు..

జిల్లాలో గతంలో 320 గ్రామపంచాయతీలు ఉండేవి. పరిపాలనా సౌలభ్యం కోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తండాలు, గిరిజన గూడేలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 385 పంచాయతీలు, 3,536 వార్డులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 7,25,702 మంది జనాభా ఉండగా ఇందులో ఎస్సీ జనాభా 1,40,361 మంది, ఎస్టీలు 21,839 మంది, ఇతరులు 5,63,502 మంది ఉన్నట్లు అంచనా ఉంది. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని మూడు నియోజక వర్గాల్లో 6,99,203 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,37,919 మంది, స్త్రీలు 3,61,254 మంది, ఇతరులు 30 మంది ఉన్నారు. జిల్లాలో 2019 సంవత్సరంలో పంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా నిర్వహించారు. మొదటి విడత 2019 జనవరి 21న జరగగా, రెండో విడత 2019 జనవరి 25న, మూడో విడత 2019 జనవరి 30న జరిగింది. గత పంచాయతీ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం సుమారు 70 వేల మంది ఓటర్లు పెరిగారు.

● వారికి అవకాశం లేని కొత్త చట్టం...

నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నిర్దేశిత గడువులోపు ఎన్నికలు నిర్వహించాల్సిందే. లేదంటే ప్రత్యేకాధికారులను నియమించి పల్లె పాలనను కొనసాగించాల్సి ఉంటుంది. పదవీ కాలం పూర్తయిన తదనంతరం ఆయా పాలకవర్గాలను పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించేందుకు కొత్త చట్టం అనుమతించడం లేదు. అలా వారిని నియమించాలంటే అసెంబ్లీలో చట్ట సవరణ జరగాల్సి ఉంటుంది. లేదా ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తేవాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనకే మొగ్గు చూపుతున్నట్లుగా తెలుస్తోంది.

మండలస్థాయి అధికారులతో..

గ్రామపంచాయతీలకు మండలస్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించనున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యం లేని శాఖలకు చెందిన అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించాలనే ఆలోచనలో జిల్లా యంత్రాంగం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా మండల పరిషత్‌లోని సూపరింటెండెంట్లు, ఎంపీవోలు, వ్యవసాయాధికారులు, పశువైద్యాధికారులు, ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన ఏఈలను నియమించే అవకాశాలున్నాయి. మేజర్ గ్రామపంచాయతీలకు జిల్లా, డివిజన్‌స్థాయి అధికారులను నియమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాతే..

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పని చేస్తోంది. మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటోంది. అభయ హస్తం ప్రజాపాలన కార్యక్రమాలను నిర్వహించి ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరించింది. సంబంధిత దరఖాస్తులను ఇప్పటికే ఆన్‌లైన్ చేయడం పూర్తి చేసింది. ఈనెల 20వ తేదీ నుంచి ఇంటింటి సర్వే చేపట్టి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తుల ఆధారంగా అర్హులను ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి ప్రభుత్వ ఫలాలను అందించాలని యోచిస్తోంది. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన అనంతరం జూన్ నెలలో స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

అంతా సందిగ్ధం..

పదేళ్ల పాటు రిజర్వేషన్లు ఉండేలా నూతన పంచాయతీరాజ్ చట్టంలో పొందుపర్చారు. 2018 సంవత్సరంలో ఎన్నికలు నిర్వహించిన సమయంలో నిర్ధేశించిన రిజర్వేషన్లు పదేళ్ల పాటు అమలులో ఉంటాయని వెల్లడించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ బీసీల రిజర్వేషన్లను పెంచుతామని ఎన్నికల హామీలో ప్రకటించింది. బీసీ గణన చేపట్టి ఆయా గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు నిర్ధారిస్తామని కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. పంచాయతీల సంఖ్య పెరిగిన నేపథ్యంలో రిజర్వేషన్ల మార్పు తప్పనిసరిగా కనిపిస్తోంది. అయితే ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తారా....కొత్త ప్రభుత్వం మార్పులు చేస్తుందా...అనే దానిపై అనుమానాలు ఉన్నాయి. ఇప్పటికే ప్రస్తుత సర్పంచులు, వార్డు మెంబర్లు రిజర్వేషన్లు కొనసాగితే మరోసారి పోటీలో దిగేందుకు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేసుకునే అవకాశాలున్నాయి. రిజర్వేషన్లు మారిస్తే మాత్రం పెరిగిన జనాభా ప్రతిపాదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ స్థానాలకు మరోసారి రిజర్వేషన్లు ప్రకటించాలని ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రకటించిన ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉంది. ఈ జాబితాను వార్డుల వారీగా విభజించాల్సి ఉంటుంది. ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అప్పటి వరకు రిజర్వేషన్లపై సందిగ్ధం కొనసాగుతుంది.

ప్రభుత్వ నిర్ణయం మేరకే...



దేవరాజు, జిల్లా పంచాయతీ అధికారి

ప్రభుత్వ నిర్ణయం మేరకే జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ జరుగుతుంది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాము. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అందుకు అనుగుణంగా వెళ్లడానికి ముందస్తు కసరత్తులు చేస్తున్నాము.

గడువులోగా సీఎంఆర్ బకాయిలు చెల్లించాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల టౌన్, జనవరి 17: రైస్ మిల్లర్లు గడువులోగా సీఎంఆర్ బకాయిలు చెల్లించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాష ఆదేశాలు జారీ చేశారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం రా రైస్ మిల్లర్లతో వానాకాలం 2022-23 సంవత్సరానికి సంబంధించి సీఎంఆర్ చెల్లింపులపై అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జనవరి 31లోగా సీఎంఆర్ బకాయిలు చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌర సరఫరాల శాఖ సిబ్బంది రోజువారి లక్ష్యం ప్రకారం మిల్లుల నుంచి సీఎంఆర్ డెలివరీ చేయించాలన్నారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్‌రూల్స్‌ను ప్రతీ ఒక్కరు పాటించాలి

జగిత్యాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాష బుధవారం అన్నారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు నిర్వహించే జాతీయ భద్రతమాసోత్సవాల సందర్భంగా ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించే పోస్టర్‌ను డీటీవో వంశీధర్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవాణాశాఖ అధికారిని ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రాలకు అనుమతి తప్పనిసరి

- జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్



వెల్గటూర్‌లో ఆర్ఎంపీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

వెల్గటూర్, జనవరి 17: అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రాల ఆర్ఎంపీలు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్ హెచ్చరించారు. మండల కేంద్రం లోని పలు ఆర్ఎంపీ కేంద్రాలను బుధవారం జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్, ప్రోంగ్రాం అధికారి ఆకుల శ్రీనివాస్‌తో కలిసి తనిఖీ చేశారు. ఆసుపత్రుల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ వైద్యులకు వారి పరిమితులకు లోబడి రోగులకు చికిత్స అందించాలని ఆదేశించారు. ప్రథమ చికిత్స కేంద్రాలకు తప్పనిసరిగా వారం రోజుల్లో అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. కమీషన్‌లకు ఆశ పడి రోగులను భయభ్రాంతులకు గురి చేసినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్, సీహెచ్‌వో జగన్, సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలువలో పూడికతీత



ఎక్స్‌కవేటర్‌తో పూడిక తీయిస్తున్న నాయకులు

బీర్‌పూర్, జనవరి 17: మండలంలోని రోళ్ల వాగు మెయిన్ 2ఎల్ కాలువలో పూడికతీత పనులను బుధవారం ప్రారంభించారు. 2ఎల్ కాలువలో పేరుకుపోయిన చెత్త కారణంగా చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగు నీరు అందడం లేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి రైతులు తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ ఎక్స్‌కవేటర్ పంపించి పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూమిని పరిశీలించిన ఆర్డీవో

రాయికల్, జనవరి 17: రాయికల్ మండలంలోని బోర్నపెల్లిలో గల వెంకటేశ్వర్ల గుట్ట వద్ద గల ప్రభుత్వ భూమిని జగిత్యాల ఆర్డీవో వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. బోర్నపెల్లిలో నిర్మించనున్న సెంట్రల్ స్కూల్ నిర్మాణానికి కావాల్సిన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ ఎండీ ఖయ్యూం, సర్పంచ్ లతరాజు, ఉపసర్పంచ్ కొడిపెల్లి ఆంజనేయులు, ఆర్ఐలు పద్మయ్య, దేవదాసు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల, జనవరి 17: మండల కేంద్రంలో నిర్మించిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మండల కేంద్రంలోని పడమటి వాడరెడ్డి సంఘం సభ్యులు బుధవారం 25వేల 116 రూపాయలను విరాళంగా ఆలయ పూజారి నాగరాజు రమేష్‌కు అందించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మల్యాల, జనవరి 17: మండలంలోని ముత్యంపేట, మల్యాల, తాటిపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురు మృతుల కుటుంబాలను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బుధవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. బీజేపీ నాయకులు వేణు, శ్రావన్, మల్లేశం, సామ మహిపాల్‌రెడ్డి, రాజశేఖర్, శ్రీధర్‌గౌడ్, మల్లేశం, మునీందర్ ఉన్నారు.

31 నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, జనవరి 17: శాతవాహన యూనివర్సిటీ (ఎస్‌యూ) పరిధిలోని పీజీ మూడో సెమిస్టర్ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎమ్మెస్‌డబ్ల్యూ విద్యార్థులకు ఈ నెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మల్లాపూర్, జనవరి 17: మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన ఏనుగు సంజీవరెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందజేశారు. బుధవారం సంజీవ్‌రెడ్డి కటుంబ సభ్యులను పరామర్శించి వారికి రూ. 10వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచు కొడిమ్యాల రవి, తోట శ్రీను, మాచర్ల దసరెడ్డి, ఏనుగు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంజన్న చెంతకు అయోధ్య రాముని పాదుకలు

● స్వాగతం పలికిన ఎంపీ బండి సంజయ్





కొండగట్టులో రాముని పాదుకలతో బండి సంజయ్, స్వాగతం పలుకుతున్న ధర్మపురి వాసులు

మల్యాల, జనవరి 17: అయోధ్య రామమందిరం నుంచి పాదయాత్ర ద్వారా తీసుకువచ్చిన రాముని పాదుకలు కొండగట్టు అంజన్న సన్నిధానానికి చేరుకున్నాయి. చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధానర్చకులు ఆత్మరాం మహారాజ్‌తో పాటు పలువురు శిష్యులు పాదుకలు తీసుకురాగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ దిగువ కొండగట్టులో స్వాగతం పలికారు. ఆత్మరాం మహారాజ్‌తో పాటు శిష్యులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వందలాదిగా భక్తులు పాదుకలకు స్వాగతం పలికారు. అనంతరం పాదుకలను అంజన్న ఆలయానికి చేర్చారు. పాదుకలను కొండగట్టు ప్రాంతంలో భక్తుల సందర్శనార్థం ఏర్పాటు చేయనున్నట్లు భక్తులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి: అయోధ్య నుంచి రాముని పాదుకలతో పాదయాత్రగా బయలుదేరిన సురేష్ ఆత్మారాంజీ బృందం ధర్మపురి క్షేత్రానికి బుధవారం చేరుకుంది. జిల్లాలోని కొండగట్టు వెళుతున్న బృందం క్షేత్రానికి చేరుకోగా నంది చౌక్ వద్ద మంగళ వాయిద్యాల మధ్య వేదపండితులు, అర్చకులు, భక్తులు వెంటరాగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఇసుక స్తంభం మీదుగా స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సురేష్ ఆత్మారాంజీ బృందం సభ్యులు చేరుకున్నారు. అనంతరం రాముని పాదుకలను శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి చెంతన ఉంచారు. అనంతరం ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్యా, నరసింహమూర్తి, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సురేష్ ఆత్మారాంజీ బృందం సభ్యులు స్వామి దర్శనం చేసుకున్నారు. స్వామి తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ ఆత్మారాంజీ మాట్లాడుతూ రాముని పాదుకలతో పాదయాత్రగా బయలు దేరి ఈ క్షేత్రానికి చేరుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి నుంచి తమ బృందం సభ్యులు కొండగట్టు చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. రామరాజ్య స్థాపన కోసం ఈ నెల 22న అయోధ్య రాముని విగ్రహ పునః ప్రతిష్ఠ సందర్భంగా కొండగట్టు పరిసరాల్లో పాదుకలను ప్రతిష్ఠాపన చేస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఇందారపు రామయ్య, ప్రధాన కార్యదర్శి నందగిరి గిరిధర్, సంతోషీమాతా ఆలయ అర్చకులు మధ్వాచారి రాంకిషన్, పురాణపు సాంబ మూర్తి, తిరుమన్ దాసు సత్యనారాయణ, కాసర్ల వెంకటరమణ, రాజేష్, గణేష్, మహేందర్, కాంతన్న, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగ మేళా

జగిత్యాల అర్బన్, జనవరి 17: జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనకు ఈ నెల 19న ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కలెక్టర్ కార్యాలయంలోని రెండవ అంతస్తులో రూమ్ నెం (218), జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి సత్తెమ్మ తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని వరుణ్ మోటార్స్, జగిత్యాల జిల్లాలోని శ్రీరామ్ చిట్స్‌లలో గల ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. టెక్నీషియన్‌లు, అడ్వైజర్స్ డ్రైవర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ (ఫిమేల్), టెక్నికల్ అడ్వైజర్, సేల్స్ మేనేజర్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ డీజిల్ మెకానిక్, బీటెక్ లేదా డిప్లమా మెకానికల్ ఇంజనీరింగ్ ఉన్నవారు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులు జగిత్యాల, కరీంనగర్ జిల్లాలో పనిచేయవల్సి ఉంటుందని, ఎనిమిది వేల రూపాయల నుంచి 15వేల రూపాయల వేతనం ఇస్తారని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన యువతీ, యువకులు ఈ నెల 19న నిర్వహించే జాబ్‌మేళాకు హాజరై, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంప్లాయిమెంట్ జిల్లా అధికారి సత్తెమ్మ తెలిపారు.

బైపాస్ రద్దుకు సహకారం అందించాలి

కోరుట్ల రూరల్, జనవరి 17: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎకీన్‌పూర్ గ్రామ శివారు నుంచి వెళుతున్న బైపాస్ రద్దుకు సహకారం అందించాలని కోరుతూ నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌కు గ్రామ రైతులు బుధవారం వినతిపత్రం అందించారు. నిజామాబాదు జిల్లా కేంద్రంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ అర్వింద్‌ను వారు కలిశారు. గ్రామ పరిధిలోని 5, 6వ వార్డు నుంచి నేషనల్ హైవే కోసం బైపాస్ రోడ్డుకు హద్దులు ఏర్పాటు చేస్తున్నారని, పనులను నిలిపివేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. హైవేతో విలువైన భూములు కోల్పోతామని ఎంపీకి వివరించినట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, గ్రామస్థులు మిట్టపెల్లి తిరుపతిరెడ్డి, మహిపాల్ రెడ్డి, కందరి రాఘవ రెడ్డి, సింగిరెడ్డి గంగారెడ్డి, నల్ల మలేశం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

రాయికల్, జనవరి 17: రాయికల్ పట్టణంలో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. రాయికల్ పట్టణంలోని భరతమాత విగ్రహం వద్ద బుధవారం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండలానికి చెందిన ఆత్రం సోనేరావును పట్టుకుని అతని వద్ద నుంచి రూ.50 వేల విలువ గల 2.03 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇటీవల పట్టుబడిన భూపతిపూర్‌కు చెందిన నిందితులకు సోనేరావు గంజాయి విక్రయించినట్లు సమాచారం.

వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలి

టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న వరుణ్‌రెడ్డి

జగిత్యాల టౌన్, జనవరి 17: అన్ని కేటగిరీల వినియోగదారులకు అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలోని విద్యుత్ శాఖ అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తూ బిల్లులను సకాలంలో చెల్లించేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లు అధికంగా కాలిపోతున్నాయని వాటిని అరికట్టాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు కేంద్రంలో పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వ్యవసాయ వినియోగదారులకు సాధ్యమైనంత త్వరలో అవసరమైన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి సర్వీస్‌లు రిలీజ్ చేయాలన్నారు. అనంతరం సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. సమావేశంలో ఎస్ఈ సత్యనారాయణ తదితరలు ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌కు జిల్లా ఉద్యోగుల వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

జగిత్యాల అర్బన్/రాయికల్, జనవరి 17: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ జగిత్యాల జిల్లా శాఖ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిల్మ్‌భవన్‌లో ఓ కార్యక్రమానికి విచ్చేసిన టీపీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టో కమిటీ సభ్యులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత పదేళ్లుగా విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నామన్నారు. సమగ్ర ఉద్యోగులకు మినిమం స్కేల్ అమలు చేయడంతో పాటు, ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ప్లానింగ్ అప్రూవల్ బోర్డులో సమగ్ర ఉద్యోగుల జీతాలను పెంచడం కోసం తొమ్మిదేళ్లుగా ప్రపోజల్ పెట్టకపోవడం విచారకరమని, ఈ విధానం అమలు దిశగా ప్రభుత్వం చొరవచూపాలని కోరారు. తమ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు సమగ్ర శిక్ష ఉద్యోగులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు బర్ల నారాయణ, కుడుకల రవీందర్, కోయడ శ్రీశైలం, వొడ్నాల సాయి, నదీమ్ పాషా తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌ల పెండింగ్ బకాయిల విడుదలకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్, జనవరి 17: సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లుల విడుదల కోసం కృషి చేస్తానని ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి అన్నారు. గ్రామపంచాయితీలో పనిచేసే కారోబార్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఇందిరాభవన్‌లో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సర్పంచ్‌ల పెండింగ్ నిధులను విడుదల చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నాలుగు సంవత్సరాలు నుంచి పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో సర్పంచులు అప్పులపాలయ్యారని మండిపడ్డారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిందన్నారు. పంచాయితీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని తెలిపారు. పంచాయతీలకు కావాల్సిన నిధులు విడుదల చేస్తేనే వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. పంచాయితీల పెండింగ్ బిల్లుల విడుదల కోసం తన వంతుగా కృషిచేస్తానని అన్నారు. పార్ట్ టైం క్లర్కులను మల్టీపర్పస్ వర్కర్లుగా చూడడంతో వారు చేస్తున్న సేవలకు గుర్తింపులేకుండాపోతుందని కారోబార్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపేవిధంగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జగిత్యాలరూరల్ మండల శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు జున్ను రాజేందర్, కారోబార్ల మండల అధ్యక్షుడు వేముల భరణి, కారోబార్ల సంఘసభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలకు త్వరలో పరిష్కారం

- పీఆర్‌టీయూటీ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జనవరి 17: ఉపాధ్యాయుల సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని పీఆర్‌టీయూటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, టిపిసిసి అధికారప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని ఫిలింభవన్‌లో పీఆర్‌టీయూటీ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను కొత్తగా తయారు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు 57/4, 57/5 మెమోను అమలు చేయాలని, పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఎస్‌జీటీ, ఎస్‌ఏలకు వేతన వ్యత్యాసాలను తగ్గించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మంచిరెడ్డి అనంత్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పర్వతి సత్యనారాయణ, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ ఉపాధ్యక్షులు కేతిరి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మక్కపేట శివారులో చిరుత పులుల సంచారం

ఇబ్రహీంపట్నం, జనవరి 18: మండలంలోని అమ్మక్కపేట గ్రామ శివారులోని వ్యవసాయ భూములలో, చెరుకు తోటలలో చిరుత పులుల సంచారం కలకలం రేపుతోంది. గ్రామ శివారులోని అటవీ ప్రాంతం వెంబడి, వ్యవసాయ తోటలలో రెండు రోజుల నుంచి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఓ రైతుకు చెందిన తోటల నుంచి పులులు వెళ్లినట్లు అటవీ శాఖ అధికారులకు గ్రామస్థులు సమాచారం అందించారు. ఎఫ్ఆర్ఓ షౌకత్ అలీ అక్కడకు చేరుకుని చిరుత పులి పగ్ మార్క్సు(అడుగులు) పరిశీలించారు. అటవీ ప్రాంతంలో, పరిసర ప్రాంతంలో పూర్తి నిఘా పెడుతున్నట్లు షౌకత్ అలీ తెలిపారు. అనుమానిత ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత పది రోజుల క్రితమే పక్కన ఉన్న సత్యక్కపల్లె గ్రామంలో సంచరించిన పులి అమ్మక్కపేట గ్రామ శివారుకు వచ్చి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 17: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 39మంది రైతులు 422 క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు పది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,700, కనిష్ఠ ధర రూ.5,200 చెల్లించారు.

ప్రమాదవశాత్తు వృద్ధుడు మృతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 17: ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన వృద్ధుడు గూడ రాజిరెడ్డి(90) కల్వర్టు పైనుంచి పడి ప్రమాదవశాత్తు మృతి చెందాడని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టుపై కూర్చున్న రాజిరెడ్డి ప్రమాదవశాత్తు కింద పడడంతో గాయాలతో చనిపోయాడు. మృతుడి కొడుకు అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి పెట్టండి

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అదనపు ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశ్రమలు, గనులు, గృహ నిర్మాణం, హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ విభాగాల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా పెండింగ్ బకాయిలపై చర్చించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు విక్రయించిన భూములు, వచ్చిన ఆదాయం, పెండింగ్ బకాయిల మీద సమగ్ర సమీక్ష చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతిపైసా వదలొద్దని అధికారులకు సూచించారు. పారిశ్రామిక పార్కులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తూప్రాన్‌లో పరిశ్రమల కోసం 325 ఎకరాలు ప్రభుత్వం కేటాయించగా ఇప్పటి వరకు 139 ఎకరాలే సేకరించారని, మిగిలిన భూమిని సత్వరమే సేకరించాలని ఆయన ఆదేశించారు. పరిశ్రమల శాఖ పరిధిలో జాయింట్ వెంచర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ వనరులపై ఆరా తీశారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో 12 జాయింట్ వెంచర్ ప్రాజెక్టుల్లో ఆరు ప్రాజెక్టులు పూర్తయ్యాయని, వాటి నుంచి రూ.955 కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉండగా రూ.430 కోట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. రూ.525 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మైనింగ్ శాఖలో రావాల్సిన ఆదాయంపై భట్టి, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

దిద్దుబాటు చర్యలకు శ్రీకారం!

» ఔటర్ భూముల ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన

ఘట్‌కేసర్, జనవరి 17: ఘట్‌కేసర్ మండలంలో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్మాణం కోసం సేకరించిన భూముల ఆక్రమణలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ భూ ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'దోస్తీకు సర్వీస్, ఔటర్‌లో చీటర్స్, మృతుడి పేర పట్టాదారు పాసుపుస్తకాలు' వంటి వరుస ప్రత్యేక కథనాలకు స్పందించి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ బుధవారం పలు మండలాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓఆర్ఆర్ కోసం సేకరించిన భూమి ఎంత ? ఆ భూమి వివరాలు ధరణిలో నమోదయ్యాయా? అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ సేకరించిన భూమి వివరాలను పరిశీలించి ఎక్కడైనా ధరణిలో నమోదు కాకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములు కోల్పోయిన వారు పరిహారం తీసుకోకుండా కోర్టులో డిపాజిట్ అయిన వారి వివరాలను కూడా ధరణిలో పొందుపర్చాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి సమగ్ర వివరాలు రికార్డుల్లో ఉండాలని స్పష్టం చేశారు. కాగా, ఘట్‌కేసర్ మండలం పడమటిసాయిగూడలో 7.30ఎకరాల భూమిని ఔటర్ కోసం సేకరించగా పరిహారం కూడా చెల్లించారు. అయినా అందులో 5.08ఎకరాలకు మృతి చెందిన వ్యక్తి పేర పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన అధికారులు మృతుడి పేర జారీ అయిన పట్టాదారు పేరున ఉన్న భూమిని ధరణి పోర్టల్‌లో ఔటర్ భూమి అని రికార్డులు సవరించారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్

పంజాగుట్ట, జనవరి17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. డిసెంబరు 23న ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులు షకీల్ పేరును ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్టులో చేర్చారు. ప్రమాదానికి కారణమైన షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్ దుబాయ్ పారిపోయేందుకు షకీల్ సహకరించారని పోలీసుల అభియోగం. సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు మొత్తం పది మంది సాయపడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో షకీల్ ఇంట్లో పని చేసే అర్బాజ్(25), కారు డ్రైవర్ సొహైల్(26) ఉన్నారు. ఇక, మాజీ ఎమ్మెల్యే షకీల్, జకీయా, షాహిద్‌పై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు ఖలీల్, షర్ఫుద్దీన్, అస్లాం అనే వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

పారదర్శకంగా మెడికల్ బోర్డు ఫిట్‌నెస్ పరీక్ష

» మోసగాళ్లను నమ్మకండి: సింగరేణి సీఎండీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో డ్యూటీలు చేయలేని సింగరేణి ఉద్యోగుల కోసం మెడికల్ బోర్డు చేపట్టే ఫిట్‌నెస్ పరీక్ష అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, అక్రమాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ బోర్డులో నిపుణులైన వైద్యులు పరీక్షించి, నిబంధనల ప్రకారం అనారోగ్యులైన ఉద్యోగులను అన్ ఫిట్ చేస్తారని అన్నారు. వారి స్థానంలో కారుణ్య నియామకాలను వెంటనే చేపడుతున్నామని తెలిపారు. అన్ ఫిట్ చేయిస్తామనే మోసగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని.. అలాంటి వారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని కార్మికులకు సూచించారు.

బీజేపీ సర్కార్ వైఫల్యాలపై 'యంగ్ ఇండియా కీ బోల్'

» వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యంగ్ ఇండియా కీ బోల్ సీజన్-4'ను ప్రారంభిస్తున్నటు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం శివసేన రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి 'యంగ్ ఇండియా కీ బోల్-సీజన్-4' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా యంగ్ ఇండియా కీ బోల్ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రానికి ఆరుగురు ఐపీఎస్‌ల కేటాయింపు

» ఇందులో ఇద్దరు తెలంగాణవారే

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆరుగురు కొత్త ఐపీఎస్(ఇండియన్ పోలీస్ సర్వీస్) అధికారులను కేటాయించింది. 2022 బ్యాచ్‌కు చెందిన ఈ అధికారులను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అండర్ సెక్రటరీ అంజన్ సర్కార్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 200 మంది ఐపీఎస్ అధికారులను వివిధ రాష్ట్రాలకు కేటాయించారు. ఇందులో తెలంగాణకు కేటాయించిన ఆరుగురు ఐపీఎస్‌లలో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు కాగా.. మిగతా నలుగురు ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. జనరల్ కేటగిరీ కింద అయేషా ఫాతిమా(సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్), మంధారె సోహమ్ సునీల్(మహారాష్ట్ర), మనన్ భట్(జమ్మూకశ్మీర్), ఓబీసీ కేటగిరీ కింద పత్తిపాక సాయికిరణ్(తెలంగాణ), రాహుల్ కాంత్(జార్ఖండ్), రిత్విక్ సాయి కొట్టె(తెలంగాణ)లను రాష్ట్రానికి కేటాయించారు. కాగా.. తెలంగాణకు చెందిన అనుగు శివ మారుతిరెడ్డిని ఒడిసాకు, రావుల జయసింహారెడ్డిని వెస్ట్ బెంగాల్‌కు, ఎస్. దీప్తి చౌహాన్‌ను ఉత్తరప్రదేశ్‌కు కేటాయించారు.

7 టీఎంసీలతో మల్లన్నసాగర్ కడితే సరిపోయేది

» టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

సిద్దిపేట అర్బన్, జనవరి 17: మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై పూర్తి విచారణ జరిపించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి అమరవీరుల స్తూపం సమీపంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు అక్కడ అవసరం లేదని చెప్పినా గత ప్రభుత్వం వినలేదని పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో అన్ని టీఎంసీల నీళ్లు ఉండే అవకాశం లేనందున 7 నుంచి 8 టీఎంసీలు ఉంటే బాగుంటుందదని కూడా సూచించామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రావాల్సిన పూర్తి ప్యాకేజీ ఇంకా రాలేదని, దానిని వెంటనే చెల్లించే ప్రయత్నం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. తనకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఇస్తానని హామీ కూడా ఇచ్చిందని తెలిపారు.

భూకబ్జాదారులు 3 నెలల్లో జైలుకే

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూ కబ్జాలు చేసిన వారిని రెండు మూడు నెలల్లో జైలుకు పంపుతామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ఆక్రమణపై 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపించి, అభినందించారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ప్రభుత్వ భూముల్లో కొండలను తవ్వి విల్లాలకు రోడ్డు నిర్మిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ఆపించాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సాయంత్రంలోగా నిర్మాణాలు ఆపి అది ప్రభుత్వ స్థలమని సూచించే బోర్డు, ప్రహరీ ఏర్పాటు చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కీలక మంత్రి బావమరిది ప్రభుత్వ భూమిని పట్టపగలు కబ్జా చేశారని, పదేళ్లుగా గత ప్రభుత్వంలో లక్షల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. 'ధరణి' పేరిట కబ్జా చేసి దోచుకున్న వారి వివరాలు త్వరలో బయటపెడతామని, భూకబ్జా చేసినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కబ్జాకు గురైన భూములు కాపాడేలా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపే చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాజాగూడ కబ్జాపై చర్యలు తీసుకోవాలని నవీన్ మిత్తల్‌ను ఫోన్‌లో ఆదేశిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

120 మాసాలు అధికారంలో ఉండి నెల రోజులకే కొంపమునిగినట్టు మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో వెయ్యి కోట్ల విలువైన 400 ఎకరాల కాందిశీకుల భూమిని గత మంత్రి, ఎమ్మెల్యేలు కబ్జా చేయకుండా అడ్డుకున్నానని తెలిపారు.

కబ్జాపై కదిలారు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఉదయం 10 గంటలకల్లా ప్రాథమిక నివేదిక అందజేయాలని ఆదేశించారు. నల్లగొండలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. హైదరాబాద్‌లోని రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి ప్రాథమిక నివేదిక అందిన అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కబ్జా బాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చినట్లు రూఢీ చేసుకున్నారు. నిర్మాణదారులు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నుంచే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ యంత్రాంగం పరిశీలన

'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఖాజాగూడ పెద్ద చెరువును అనుకొని నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను, ఆ ప్రాంతాన్ని బుధవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్యతో పాటు ఇరిగేషన్ ఏఈ నాగరాజు, జీహెచ్ఎంసీ సర్కిల్-20 డిప్యూటీ కమిషనర్ రంజీత్, హైదరాబాద్ మెట్రో అధికారులు సందర్శించారు. దర్జాగా ఘాట్ రోడ్డు తరహాలో సాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంగళవారం రాత్రి వరకు బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లతో పనులు జరగ్గా, బుధవారం ఉదయానికి పనులు ఆగిపోయాయి. అక్కడ బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లు ఏవీ లేవు. చెరువు నుంచి కొండపైకి వేసే రోడ్డులో ముందు భాగంలో ఔట్‌పోస్టు వద్ద సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. అక్కడి కొండలు, గుట్టలను తవ్విన తీరును పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మల్లయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రాయదుర్గం పాయ్‌గా సర్వే నెంబర్ 66/1లో 7 ఎకరాలు, 66/2లో 1.20 ఎకరాలు మొత్తం 8.20 ఎకరాల భూమిని ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో పంచనామా చేసి అప్పగించినట్లు తెలిపారు. చెరువు నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మాణం ఏ ప్రభుత్వ విభాగం చేపట్టడం లేదని, అక్రమంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే 'ఆంధ్రజ్యోతి'కి కూడా రంగారెడ్డి డీపీఆర్ఓ ద్వారా ఆర్డీఓ లేఖను అందజేశారు. అందులోని వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తాలో సర్వే





రోడ్డు వేస్తున్న చోట ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డు; నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నెంబర్ 66లో 2009-10 పహణీ ప్రకారం 109.32 ఎకరాల భూమి 'పోరంబోకు' కింద ఉండగా వివిధ సంస్థలకు ప్రభుత్వం కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు పంచనామా చేసి అప్పగించిన 8.2 ఎకరాల స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు నిర్మించడాన్ని గుర్తించినట్లు వివరించారు. అక్రమంగా రోడ్డేసిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేశామని, మెట్రో, ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు.

కబ్జా బాధ్యులను కప్పిపుచ్చేందుకు తిప్పలు

శేరిలింగంపల్లి మండలంలో కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న కబ్జాలపై అధికార యంత్రాంగం తీరు ఆది నుంచి విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా ఓ వైపు 'ఆంధ్రజ్యోతి'లో కథనం.. ఆ వెంటనే మంత్రి ఆదేశాలతోనే ప్రభుత్వ యంత్రాంగం కదిలిందే తప్ప అంతకు ముందు విషయం తెలిసినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ భూమిలో కొండలను తొలుస్తూ రోడ్డేస్తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' వారం రోజుల ముందే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఆర్డీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వివరణ కోరింది. ఆ సందర్భంలో తమకు తెలియదని, తాము ఎలాంటి అనుమతివ్వలేదంటూ అధికారులు చెప్పుకొచ్చారు తప్ప ఎలాంటి చర్యలకూ ఉపక్రమించలేదు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన తర్వాతే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు హడావుడి చేశారు. కబ్జా ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. కబ్జా బాధ్యులను అధికారులెవ్వరూ గుర్తించలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తవ్వకాలు జరిపారనే దాన్ని పరిశీలించారు. తవ్వకాల ఆధారంగా ఏ నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందో గుర్తించడం సులువు. కానీ అదేమీ చేయలేదు. పరిసర ప్రాంతాల వారిని అధికారులు కనీసం ఆరా తీయలేదు. కబ్జా బాధ్యులను కప్పిపుచ్చే విధంగా అధికారుల తీరు ఉందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డేసేది 'గుర్తు తెలియని' వ్యక్తులట!

ఖాజాగూడ పెద్దచెరువును అనుకొని కొండలు గుట్టలను తొలుస్తూ రోడ్డేయ్యడంపై శేరిలింగంపల్లి ఆర్ఐ బుధవారం సాయంత్రం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని అందజేయడానికి రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపలేదు. రాయదుర్గం ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తా సర్వే నెంబర్ 66/1లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ శేరిలింగంపల్లి మండల అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఫిర్యాదు చేశారని, దాంతో కబ్జా చేయడం, పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేయడం లాంటి అంశాల ఆధారంగా 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదులో ప్రభుత్వ భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ పేర్కొనడం గమనార్హం. చెరువు పక్కనే ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి మరీ యథేచ్ఛగా ఘాట్ రోడ్డు తరహాలో పనులు సాగించగా.. కూలీలు గుర్తు తెలియనివారు అయినా.. పనులు చేయించిన సంస్థ గుర్తు తెలియనిది ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొండలు, గుట్టలను తొలిచేసి అక్రమంగా రోడ్డేస్తున్నవారు స్థానికంగా అధికార యంత్రాంగానికి తెలిసినప్పటికీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక మాజీ మంత్రి బామ్మర్ది ప్రమేయం ఉండడంతో వారి పేర్లను చేరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడతామని జంకుతున్నట్లు తెలిసింది. అందుకే నిర్మాణ సంస్థ పేరు కానీ, కీలక వ్యక్తుల పేర్లు చేర్చలేదని తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణలో వారే బయటపెడతారని భావించినట్లు సమాచారం. ఆది నుంచి రెవెన్యూ అధికారుల తీరు తమ చేతులకు మట్టి అంటకుండా తప్పించుకుంటున్నట్లు ఉండడం గమనార్హం.

చడీచప్పుడు లేని మెట్రో అధికారులు

బయో డైవర్సిటీ సర్కిల్ పక్కనే దాదాపుగా రూ.1,200 కోట్లకు పైగా విలువైన 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని మెట్రో అధికారులకు అప్పగిస్తే వారు కనీసం ఆ వైపు తొంగి చూడలేదు. తమ భూమి అంటూ ఇప్పటి వరకు ఎలాంటి బోర్డు కూడా అక్కడ పాతలేదు. 'కూల్‌గా కబ్జా' కథనం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి మంత్రితో పాటు ఉన్నతాధికారులు స్పందించారు. కానీ సరిగ్గా నాలుగు నెలల క్రితం ఐటీ కారిడార్‌లో గజం రూ.3 లక్షలకు పైగా ధర పలికే ప్రాంతంలో 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పొందిన హెచ్ఎంఆర్ఎల్ ఉన్నతాధికారులు చడీచప్పుడు లేకుండా ఉన్నారు. ఒకరిద్దరు అధికారులను రెవెన్యూ అధికారులకు తోడుగా పంపి చేతులు దులుపుకున్నారు. పంచనామా చేసి హెచ్ఎంఆర్ఎల్ అధికారులకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా నాటి రంగారెడ్డి కలెక్టర్ నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారుల్లోనే చర్చ నడుస్తోంది. తమకు సంబంధం లేదని రెవెన్యూ, తమకు ఆదేశాలు అందలేదని హెచ్ఎంఆర్ఎల్ దోబుచులాడుతుండగా మధ్యలో సందట్లో సడేమియాలా ప్రముఖ నిర్మాణ సంస్థ దర్జాగా రోడ్డేసుకోవడం విశేషం.

నామినేటెడ్ పదవుల్లో ఆదివాసీలకు ప్రాధాన్యం కల్పించాలి

» ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

» సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, బెల్లయ్యనాయక్, జగ్గారెడ్డి


హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల నియామకంలో ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని సమావేశం తీర్మానం చేసింది. బుధవారం గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులను, కార్యకర్తలను అభినందించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గిరిజన విభాగం కాంగ్రెస్ గెలుపు కోసం గ్రామస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పాటుపడాలని నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర లక్ష్యాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయాలని ఆమె సూచించారు.



ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, రోహిత్, బెల్లయ్య నాయక్, జగ్గారెడ్డి తదితరులు

అభివృద్ధికోసం తండ్లాడి.. ఎన్నికల్లో తడబడ్డాం!

(మొదటిపేజీ తరువాయి)



స్థానం అధికారం నుంచి ప్రతిపక్షానికి మారింది. దీనికి అధైర్య పడాల్సిన అవసరం లేదు. ఓటమి నుంచి తేరుకుని నెలరోజులకే సమీక్ష సమావేశాలను ప్రారంభించాం. ఇది పదకొండో పార్లమెంటరీ స్థాయి సమావేశం. కార్యకర్తల నుంచి విలువైన సూచనలు వచ్చాయి. కార్యకర్తలు కోరుకుంటున్న ప్రకారమే ఇకపై పార్టీ పనిచేస్తుంది. మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వాటిని అమలు చేయమని అడిగితే.. కాకమ్మ కథలు చెబుతోంది" అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా పదేళ్లు పాలన సాగించడం అరుదని, ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని ఐదేళ్లలోపే ఇంటికి పోయిన కాంగ్రెస్ ప్రభుత్వాలే ఈ దేశంలో ఎక్కువగా ఉన్నాయన్నారు. అరచేతిలో వైకుంఠం చూపేలా కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తెచ్చిందని, హామీల అమలు గడువు ప్రకారం వంద రోజులు కాలేదని ఆగామని, లేకుంటే.. కాంగ్రెస్ సర్కారును చీల్చి, చెండాడే వారిమన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలకు నిధుల్లేవని ఆ రాష్ట్ర సలహాదారు చెబుతున్నారని, ఇక్కడ కూడా కాంగ్రెస్ నేతలు చావుకబురు చల్లగా చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని జోస్యం చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దావోస్‌కు వెళ్లడమంటే ఖర్చు దండగ అన్నారు. ఇప్పుడేమంటారు? సీఎం బృందం దావోస్‌కు వెళ్లింది. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హత్యారాజకీయాలు మొదలు పెడుతోంది" అని హరీశ్ మండిపడ్డారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పైనా హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొంటారని బండి సంజయ్ చెబుతున్నారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన, పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బీజేపీదే. ఆ విషయాన్ని ఆయన తెలుసుకోవాలి" అని సూచించారు.

కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే..

అధికారంలో ఉన్నన్ని రోజులు పార్టీ కార్యకర్తలను, ముఖ్య నాయకులు పట్టించుకోలేదని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసు కునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారని తెలిసింది. పక్క పార్టీల వల్ల కాకుండా.. సొంత పార్టీ నేతలే ముంచారని ఆరోపించినట్లు సమాచారం. పార్టీ ఓటమికి కారణాలు చెబుతూ.. అధిష్ఠానం తీరుపైనా పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "అసంతృప్తి మొదలైనప్పుడే బుజ్జగించి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. జూపల్లి కృష్ణారావు లాంటి వారు పార్టీని వీడడం వల్ల నష్టం వాటిల్లింది" అని వారు అభిప్రాయపడ్డట్లు తెలిసింది.

రాష్ట్రం పరువు తీసేలా రేవంత్ వ్యాఖ్యలు

దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంతర్ తెలంగాణ గురించి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్రం పరువు తీసేలా ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయుడు, జైపాల్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. విదేశీ పర్యటనల్లో సీఎం అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం తగదని, ఇటువంటి పరిస్థితులు ఇకపై రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

కేసీఆర్ నడుస్తున్నారు...!

'ఎక్స్'లో వీడియో పోస్టు చేసిన ఎంపీ సంతోష్

హైదరాబాద్, జనవరి17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ సంతోష్ కుమార్ శుభవార్త చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం మాజీ సీఎం కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారని, చేతికర్ర సాయంతో నెమ్మదిగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. స్వగృహంలో కేసీఆర్ నడుస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ఆయన, ప్రతి అడుగు దృఢ సంకల్పంతో వేస్తున్నారని తన ఎక్స్ వేదికలో పేర్కొన్నారు.

డీఎస్సీకి అనుబంధ నోటిఫికేషన్!


(మొదటిపేజీ తరువాయి)

డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా, గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌తో టీచర్ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పోస్టులకు సంబంధించి గత ఏడాది నవంబరు 20 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పరీక్షలను వాయిదా వేశారు. వాటిని మళ్లీ ఎప్పుడు నిర్వహించే అంశాన్ని ప్రకటించలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోగా.. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తే... సాంకేతికంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న అంచనాకు వచ్చింది. ముఖ్యంగా 1.77 లక్షల మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నందున.. వారి నుంచి ఆందోళన ఎదురవుతుందని భావిస్తున్నారు. ఈ సమస్య రాకుండా గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా మరో నోటిఫికేషన్ జారీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో కొత్తగా చేర్చిన పోస్టుల వివరాలను పొందుపరిచి, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మరో అవకాశం ఇవ్వనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉండదు.

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేకపోయినా..

మెగా డీఎస్సీలో సుమారు 12 వేల ఉపాధ్యాయ పోస్టుల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. కొత్తగా చేర్చే వాటిలో స్పెషల్ టీచర్ పోస్టులు 1,523 వరకు ఉంటాయి. అదనంగా మరో 4,281 ఖాళీ పోస్టులను గుర్తించారు. వీటితోపాటు మోడల్ స్కూళ్లలో మరో 1,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో పదోన్నతులు కల్పించడం ద్వారా మరికొన్ని పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటిని కూడా మెగా డీఎస్సీలో చేర్చనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేదు. అయినప్పటికీ ఇలాంటి పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషనలైజేషన్ ద్వారా ఇలాంటి పాఠశాలల్లోని పోస్టులను రద్దు చేయాలనే ప్రతిపాదన గతంలో ఉండేది. తాజాగా దీనిని ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 26 వేల పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు 6వేల స్కూళ్లలో ఏకోపాధ్యాయుడే ఉన్నారు. మరో 1,290 పాఠశాలల్లో 'జీరో' అడ్మిషన్లు నమోదయ్యాయి. వీటన్నింటిలో ఖాళీల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలను రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లాల వారీగా మెరిట్ జాబితాను రూపొందించి.. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది. ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే పోస్టుల భర్తీ జరగనుంది.

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తాం: కోమటిరెడ్డి



నల్లగొండ: ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని, గత ప్రభుత్వంలో పేపర్ లీకులు జరిగినట్లుగా కాకుండా యూపీఎస్సీ తరహాలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు



గుంతలతో ప్రమాదకరంగా మారిన రోడ్డు

కథలాపూర్, జనవరి 17: మండలంలోని కలికోట గిరిజన తండా వద్ద రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు ప్రమాదకరంగా మారాయి. వేములవాడ-కోరుట్ల రహదారిపై ఏర్పడ్డ ఈ గుంతల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తండా నుంచి వచ్చే మురికి నీరు రోడ్డుపై నిలిచి రోడ్డంతా చెడిపోయింది. వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురైన సందర్భాలు న్నాయి. ప్రతిరోజు వందలాది మంది వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి ఈ రోడ్డు వెంటే వెళ్తుంటారు. కలికోట గిరిజనతండా రాగానే వాహన యజమానులు భయపడిపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

చెక్‌డ్యాం, పెద్దచెరువు మత్తడి మరమ్మతులు చేపట్టాలి

మెట్‌పల్లి రూరల్,జనవరి17: మండలంలోని ఆత్మకూర్ గ్రామ శివారులోని చెక్‌డ్యాం, పెద్దచెరువుల మత్తడికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు బుధవారం ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ నిధులతో నిర్మాణం చేపట్టిన చెక్‌డ్యాం కొద్దిరోజులలోనే లీకేజీలు ఏర్పడి నీటి నిల్వలు పూర్తిగా ఇంకిపోయినట్లు పేర్కొన్నారు. చెక్‌డ్యాం, పెద్ద చెరువుకు మరమ్మతులు చెపట్టకపోవడంతో ఎండాకాలంలో మరింత నీటి సమస్య ఉండే ప్రమాదం ఉంటుందని తెలిపారు. అధికారులు వెంటనే స్పదించి మరమ్మతులు చేపట్టాలని కోరినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో చిలివేరి దిలీప్, నేరెళ్ల శ్రీనివాస్, కనాకట్టు శేఖర్, కుంటా బాలరాజు, మాసం రాజాం, కుంటకొలలా నర్సారెడ్డి, కాటిపెల్లి ప్రదీప్, కాటిపల్లి నరేష్, రైతులు ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగం మానవ మనుగడకే ప్రమాదం



జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్

కోరుట్ల, జనవరి 17: ప్లాస్టిక్ వినియోగంతో మానవ మనుగడకే ప్రమాదకరమని మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ అన్నారు. పట్టణంలోని 33వ వార్డులో కౌన్సిలర్ రుద్ర సుజాతలతో కలిసి జ్యూట్ బ్యాగులను బుధవారం పంపిణీ చేసి మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్ వ్యాధితో పాటు వివిధ రకాల రోగాలు సోకడానికి అస్కారం ఉంటుందని అన్నారు. ప్లాస్టిక్ వినియోగానికి ప్రజలు దూరంగా ఉండాలని మార్కెట్‌తో పాటు వివిధ రకాల సరుకులు కొనుగోలు చేయడానికి జ్యూట్ బ్యాగులు వినియోగించాలని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి టీఎంసీ సంధ్య, సీవో శివ, ఆర్‌పీ రజని పాల్గొన్నారు.

వైకుంఠ రథం ఏర్పాటు చేయడం అభినందనీయం

కోరుట్ల రూరల్, జనవరి 17: గ్రామస్థుల సౌకర్యార్థం వైకుంఠ రథం ఏర్పాటు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. బుధవారం మండలంలోని సంగెం గ్రామంలో కోరుట్ల పట్టణానికి చెందిన కొత్త శ్రీనివాస్, గణేష్ వారి తండ్రిదండ్రులైన కొత్త శ్రీరాములు-లక్ష్మి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వైకుంఠ రథంను వైస్ ఎంపీపీ, రైతు సమన్వయ కమిటీ జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి స్వరూప-చీటి వెంకటరావుతో పాటు గ్రామస్థులతో కలిసి ప్రారభించారు. అనంతరం కొత్త శ్రీరాముల కుంటుబ సభ్యులను గ్రామస్థులు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెప్యాల నర్సయ్య, కొత్త గణేష్-మహేశ్వరి, కొత్త శ్రీనివాస్-చందన, కోరుట్ల వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్

కోరుట్ల, జనవరి 17 : రాష్ట్ర ప్రభుత్వం విధించిన సమయం ప్రకారం ఇంటి పన్ను, వివిధ రకాల బిల్లులను సకాలంలో ప్రజలు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకారం అందించాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 పురపాలక సంఘం చట్టం ప్రకారం ఘర్ పట్టితో పాటు వివిధ రకాల ఫీజులను చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తామన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి మార్చి 31 తేదీలోపు ఇంటి పన్ను, వివిధ రకాల ఫీజులు, అడ్వర్‌టైజ్‌మెంట్‌లు, దుకాణాల రెన్యూవల్‌ను చెల్లించాలన్నారు. నూతన దుకాణాలు లైసెన్స్‌లు, దుకాణాల రెన్యూవల్ కోసం మీ సేవా కేంద్రలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి

కథలాపూర్, జనవరి 17 : రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ఆరు గ్యారంటీలకు సంబంధించి ప్రజల నుంచి స్వీకరించిన 15,891 ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసినట్టు ఎంపీడీవో జనార్ధన్ బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. వివిధ విభాగాలకు సంబంధించి సుమారు 40 మంది ఆపరేటర్లతో నిర్ణీత వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పూర్తి చేసినట్టు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలకనుగుణంగా ప్రక్రియ చేపట్టామని చెప్పారు.

ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్

కథలాపూర్, జనవరి 17: ఓటర్ల నమోదుకు సంబంధించి ఈ నెల 20, 21 తేదీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ముంతాజీబోద్దీన్ ఒక ప్రటనలో తెలిపారు. జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. స్థానిక బూత్‌లెవల్ అధికారికి తమ దరఖాస్తులు సమర్పించుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

-డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

కొడిమ్యాల, జనవరి 17: ప్రజలు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని శ్రీరాములపల్లి, నమిలికొండ గ్రామాల్లో వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామ సభలను అధికారులు బుధవారం నిర్వహించారు. శ్రీరాములపల్లి గ్రామ సభకు ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రాంత అర్హులైన ప్రజలకు మరింత చేరువ చేసెందుకు నిర్వహిస్తున్న కార్యక్రమమే వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర అన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డు కోసం అందరు నమోదు చేసుకొని ఉచితంగా కార్పోరేట్ ఆసుపత్రుల్లో 10లక్షల రూపాయల వరకు వైద్య సేవలు పొందాలన్నారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, ముద్ర లోన్లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి నిరోదించేందుకు తగిన సూచనలు చేశారు. గ్రామసభలలో ఎఫ్ఎల్‌సీ మధుసూదన్, శ్రీరాములపల్లి, నమిలికొండ గ్రామాల సర్పంచ్‌లు చల్ల శ్రీనివాసరెడ్డి, అనితనరేష్, మెడికల్ ఆఫీసర్ పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, సింగిల్ విండో డైరెక్టర్ నాగభూషణ్‌రెడ్డి, కార్యదర్శులు రాంకిషన్‌రావు, శ్రీలత, పోస్టల్ అధికారి సరిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని 14వ, 15వ వార్డుల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని మున్సిపాల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ పథకాలు అయుష్మాన్ భారత్, పీఎం విశ్వకర్మ యోజన, ముద్రలోన్, కిసాన్ క్రెడిట్ కార్డు, ఉజ్వల గ్యాస్ సిలిండర్, కిసాన్ నిధి, ఆవాస్ యోజన వంటి కార్యక్రమాల గురించి వివరించారు. పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీఒక్కరికి అందజేయాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రకు సంబంధించిన అంశాలను పొందిపరిచిన నూతన సంవత్సర కాలెండర్‌ను ఆయన అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ధోనికేళ్ల నవీన్, మర్రి పోచయ్య, సుంకేంటి విజయ్, అర్మూర్ రంజిత్, కొయ్యల లక్ష్మణ్, అరిగేల రాకేష్, మాదాస్తు సాయిప్రసాద్, ఆర్పీలు, అంగాన్‌వాడీ కార్యకర్తలు, అధికాఉలు, తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు గురికావద్దు

కథలాపూర్, జనవరి 17: యువత చెడు వ్యసనాలకు గురికావద్దని ఉన్నత చదువులు చదివి ఉజ్వల భవిష్యత్ పొందాలని కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం రాత్రి మండలంలోని ఇప్పపల్లిలో పోలీస్ కళాజాత బృందంతో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, మూఢ నమ్మకాలు, ఆత్మహత్యల నివారణపై కళాబృందం ఆటాపాటలతో అవగాహన కల్పించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులు కావద్దని సూచించారు. హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. నేను సైతం కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా పోలీస్‌శాఖ విస్తృత ప్రచారం చేస్తున్నామని అందుకు గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు 100 నంబర్‌కు డయల్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై పబ్బ కిరణ్‌కుమార్, సర్పంచ్ కోలి వసంతనరేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నాణ్యత ప్రమాణాలను పాటించాలి

- జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష

మెట్‌పల్లి, జనవరి 17: హోటల్, రెస్టారెంట్, ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయించే వారు తప్పకుండా నాణ్యత ప్రమాణాలను పాటించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష సూచించారు. పట్టణంలోని ఆర్‌బీ రెస్టారెంట్‌లో ఆమె తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఇటీవల ఆర్‌బీ రెస్టారెంట్‌లో కుళ్లిపోయిన పదార్థలతో ఆహారం తయారు చేయడాన్ని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ గుర్తించి నిర్వాహకులకు జరిమానా విధించారు. ఈ విషయంపై రెస్టారెంట్‌ను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ఆహార పదార్థాలను తయారు చేయాలని నిర్వహకులకు సూచించినట్లు తెలిపారు.

మూడు కుటుంబాల సాంఘిక బహిష్కరణ

ఇబ్రహీంపట్నం, జనవరి 18: మండలంలోని తిమ్మాపూర్‌లో మూడు కుటుంబాలను విలేజీ అభివృద్ధి కమిటీ(వీడీసీ) సభ్యులు సాంఘిక బహిష్కరణ చేశారు. గ్రామదేవతలు కొలువుదీరిన ప్రదేశాలకు దారికోసం స్థలం ఇవ్వడం లేదని ఓ మూడు కుటుంబాలపై బహిష్కరణ వేటు వేశారు. దీంతో ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆశ్రయించినా న్యాయం జరుగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రైతుల పంట పొలాల్లో గ్రామ దేవతలు కొలువై ఉన్నారు. అక్కడికి కాలి నడకన వెళ్లేందుకు అనువైన స్థలం ఉంది. నిత్యం భక్తులు అక్కడకు వెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. ఇటీవల వీడీసీ సభ్యులు దారికోసం 18 అడుగుల స్థలం ఇవ్వాలని, రిజిస్ట్రేషన్ చేయాలని భూ యాజమానులకు తెలిపారు. దీంతో రైతులు నాలుగు అడుగులు ఉచితంగా స్థలం ఇస్తామని 18 అడుగులు ఇవ్వలేమని తేల్చి చెప్పారు. కాని వీడీసీ సభ్యులు 18 అడుగులు స్థలం ఇవ్వాల్సిందే అంటూ డిమాండ్ చేశారు. అడిగినంత స్థలం ఇవ్వలేదని మూడు కుటుంబసభ్యులను వీడీసీ వెలివేసింది. గ్రామంలో ఎవరు వారికి సహకరించవద్దని, వ్యవసాయ పనులకు కూలీకి వెళ్లవద్దని, హోటల్‌లో చాయి, కిరాణ షాపుల్లో సరకులు ఇవ్వవద్దని హుకుం జారీ చేశారు. తమ ఆదేశాలు దిక్కరిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారని సమాచారం. దీంతో మూడురోజుల కిందట ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వీడీసీ సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో వీడీసీ సభ్యులు ఏడుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు బుధవారం తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి

బీర్‌పూర్, జనవరి 17: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం రైతుల పక్షానా నిలబడి అన్నిరకాల అండగా నిలుస్తుందని బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేష్ అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండలకేంద్రంలో ఎంపీపీ మసర్తి రమేష్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులను కలుసే అవకాశం ఎమ్మెల్యేలకు ఉండేది కాదని, ముఖ్యమంత్రిని కలిసే అవకాశం మంత్రులకు ఉండేది కాదని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆలాంటి పరిస్థితి లేదని అన్నారు. రోళ్ళవాగు షెటర్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను కలిసి షెట్టర్ ఏర్పాటు గురించి చెప్పాడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి ద్వారా అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే నిరుపయోగంగా ఉన్న బీర్‌పూర్ ఫిల్టర్ బెడ్ పునఃప్రారంబించిన ఘనత జీవన్‌రెడ్డిదేనని అన్నారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

మూడు గ్రామాల్లో దొంగల బీభత్సం



రామలచ్చక్కపేటలో హుండీని గ్రామ శివారులో పడేసిన దొంగలు

మెట్‌పల్లి రూరల్, జనవరి 17: మండలంలోని మూడు గ్రామాల్లో దొంగల బీభత్సం సృష్టించారు. గ్రామాల్లోని ఆలయాలను లక్ష్యంగా చేసుకున్నారు. మండలంలోని జగ్గసాగర్ పెద్దమ్మ, రామాలయం, గంగమ్మ ఆలయాల్లో తులం బంగారం, వెండి ఆభరణాలు, హుండీలను, రామలచ్చక్కపేటలోని శివాలయం, పెద్దమ్మ ఆలయాల్లోని హుండీ, ఆత్మనగర్ గ్రామాల్లోని హనుమాన్, మల్లన్న ఆలయాల్లో సుమారు 50 తులాల వెండి ఆభరణాలు, హుండీలను మంగళవారం అర్ధరాత్రి దొంగలు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. బుధవారం ఉదయం తలుపులు తెరిచి ఉండడంతోప్రజాప్రతినిధులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీం పిలిపించారు. గ్రామాల శివారుల్లో పడేసిన హుండీలను, అలయాల్లో దొంగల వేలి ముద్రలు, వివరాలను సేకరించారు.

వరిలో చీడపీడలపై అప్రమత్తతో అధిక దిగుబడులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 17 : నీటి వనరులను బట్టి రబీ వరి సాగు చేస్తున్న రైతులు పంటను ఆశించే చీడపీడలపై అప్రమత్తంగా ఉంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి షాహిద్ అలీ తెలిపారు. బుధవారం మండలంలోని కోనరావుపేట గ్రామంలోని రైతులు సాగు చేస్తున్న వరి పంటలను పరిశీలించారు. పలువురి రైతుల వరి క్షేత్రంలో మొగిపురుగు ఉధృతి ఉన్న వాటిని గుర్తించారు. మొగి పురుగు నివారణ పద్ధతుల గురించి వివరించారు. పంట పొలాలను ఎప్పటికప్పుడు పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈయన వెంటా రైతులు అనిరెడ్డి మారుతిరెడ్డి, జవుడి రమేష్, గంగారెడ్డి, ఏఈవో భూమేశ్వర్, తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏవో షాహిద్‌అలీ

మహిళలకు బెంచ్‌ప్రెస్ పోటీలు

కోరుట్ల, జనవరి 17: పట్టణంలోని షై ఫిట్ క్లబ్ జిమ్ ఆధ్వర్యంలో మహిళలకు అంతర్ జిల్లా బెంచ్ ప్రెస్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఇంటర్నేషనల్ క్రీడాకారిణి గొట్టిముక్కల శారద పోటీలను ప్రారంభించారు. పోటీల్లో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలకు చెందిన సుమార్ 62 మంది క్రీడాకారులు బెంచ్ ప్రెస్ క్రీడలో పాల్గొన్నారు. వివిధ క్యాటగిరిల్లో రాణించిన క్రీడాకారులకు నిర్వాహకులతో పాటు క్రీడాకారిణి శారద బహుమతులు పంపిణీ చేసి, ప్రశంసపత్రాలను అందించారు. అనంతరం మహిళల కోసం ఏర్పాటు జిమ్‌ను శారద ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మెట్‌పల్లి, జనవరి 17: పట్టణానికి చెందిన నక్క కళ్యాణ్ అనే యువకుడు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబసభ్యులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణరావు పరామర్శించారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి కళ్యాణ్ మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు జెట్టి లింగం, పూదరి నర్సాగౌడ్, శేఖ్ మహ్మద్, బుర్ర మహేందర్, తదితరులు ఉన్నారు.

తమ్ముడి మీద కోపంతో అన్నపై దాడి

● నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 17: మండలంలోని కొండ్రికర్ల గ్రామానికి చెందిన మెండే రమేష్‌పై ఉన్న కోపంతో ఆయన అన్న మెండే రవిపై గ్రామ సర్పంచు మేనల్లుడు ఆకుల శ్రీనివాస్ బుధవారం దాడి చేశాడు. గాయాలపాలైన రవి తమ్ముడు రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో సీసీ రోడ్లు మంజూరు కాగా వాటిని మెండే రమేష్, గడ్డం రాజారెడ్డిలు నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాలు చేసిన సీసీ రోడ్లకు సంబంధించిన నిధుల మంజూరు విషయంలో గ్రామ సర్పంచు మేనల్లుడు ఆకుల శ్రీనివాస్ అడ్డుపడుతున్నాడని ఇరువురి మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. అదే విషయంలో మెండే రమేష్‌కు సంబంధించిన బిల్లుల విషయంలో మెండే రవి సర్పంచ్ మేనల్లుడు ఆకుల శ్రీనివాస్‌ను అందరిలో అడుగుతావా అని మనస్సులో పెట్టుకున్నాడు. బుధవారం మెండే రవి పొలం పనులకు వెళ్లిన విషయాన్ని గమనించిన ఆకుల శ్రీనివాస్ గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద కాపుకాసాడు. పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తున్న రవిపై ఇనుప రాడుతో శ్రీనివాస్ దాడి చేయగా ఆయన అక్కడే పడిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమచారం అందించగా మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసపత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. బాధితుడి తండ్రి మెండే చిన్న భూమయ్య ఫిర్యాదు మేరకు అత్యాయత్నం కింద ఆకుల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

ధర్మపురి, జనవరి 17: మండలంలోని ఆకుసాయిపల్లె గిరిజన తండాలో న్యాయవిజ్ఞాన సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌ప్రసాద్ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిరుపేదలకు ఎవరికైనా ఉచిత న్యాయసహాయం కావాలంటే లీగల్ కౌన్సిల్ ద్వారా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణరెడ్డి, న్యాయవాదులు రౌతు రాజేష్, బందెల రమేష్, రామడుగు రాజేష్, మామిడాల శ్రీకాంత్, పొలంపల్లి లక్ష్మణ్, పోలీస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



కేశవరావు(ఫైల్)

మల్యాల, జనవరి 17: మండలంలోని నూకపల్లికి చెందిన శతాధిక వృద్ధుడు బండారి కేశవరావు (101) బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. కేశవరావు గతంలో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడిగా, భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దశాబ్దాల పాటు పని చేశారు. అలాగే నూకప ల్లి సింగిల్‌విండో చైర్మన్‌గా కూడా రైతుల సేవలో భాగస్వాములు అయ్యారు. ఆది నుంచి రైతుల పక్షాన ఉంటూ వారి సమస్యల కోసం పాటు పడిన కేశవరావు మృతిపై పలువురు సంతాపం తెలిపారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్ ఫోన్‌లో కేశవరావు కుటుంబసభ్యులను పరామర్శించారు.

అంజన్నను దర్శించుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే

మల్యాల: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ బుధవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అధికారులు సత్కరించారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ఉన్నారు.

విగ్రహాలను ఆవిష్కరించిన ఎంపీ



బతుకమ్మ విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

కొడిమ్యాల, జనవరి 17 : మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అంబేద్కర్, శివాజీ, బతుకమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఒకే గ్రామంలో ఒకే రోజు భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం, హిందు ధర్మాన్ని కాపాడిన ఛత్రపతి శివాజీ మహారాజు విగ్రహం, బతుకమ్మ తల్లి విగ్రహ ఆవిష్కరణ చేయటం ఆనందంగా ఉందన్నారు. మహానీయులు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ నెల 22న అయోధ్యలో నిర్వహిస్తున్న శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన విజయవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామంలోని ఆలయాల్లో నిర్వ హించే కార్యక్రమాల్లో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు డబ్బు రాధగౌతంరెడ్డి, బీజేపీ మం డల పార్టీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, జిల్లా బీజేపీ నాయకులు బుచ్చిరాములు, పద్మజనార్దన్, ఎంపీటీసీ జగన్‌మోహన్‌రెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రాజేశం, పద్మ, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జగిత్యాలలో శ్రీరామ దీక్షలు



దీక్షలు చేపట్టిన భక్తులు

జగిత్యాల టౌన్, జనవరి 17 :అయోధ్యలోని శ్రీరామ మందిరంలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా కేంద్రంలోని హరిహరాలయంలో భక్తులు శ్రీరామ దీక్షలు చేపట్టారు. వందలాది భక్తులు భక్తి శ్రద్ధలతో ఏడు రోజుల శ్రీరామ దీక్షను చేపట్టారు. అనంతరం శ్రీరామ నామ భజనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాద రామకృష్ణ, అరుణ్ కుమార్, సంతోష్, బిట్టు ఉన్నారు.

నేటి నుంచి వేద పారాయణం ప్రారంభం

ధర్మపురి, జనవరి 17: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆవరణలో గల శేషప్ప కళా వేదిక ఎదుట సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, సంపూర్ణ రుగ్వేద హవనం, సంపూర్ణ సామవేద పారాయణం కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈ నెల 18న ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తారనిన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని శ్రీ మఠాధిపతులు దివ్య ఆశీస్సులతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ శ్రీ ప్రేమిక వరద, వేదపరి పాలన సభ ఆధ్వర్యంలో 21 మంది వేద పండితులతో ఈ నెల 18 నుంచి 24 వరకు కార్యక్రమాలు ఉంటాయని ఆయన వివరించారు. విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సమక్షంలో ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు, వేద బ్రాహ్మణుల సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించడం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మహిళా, శిశు సంక్షేమ శాఖ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్, జనవరి 17: మహిళా, శిశు సంక్షేమ శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహిళా సాధికారత బృందం సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని ఇటిక్యాల గ్రామంలో బుధవారం వసుంధర మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలకు మిషన్ శక్తి స్కీం, మహిళా సాధికారత, 181-సఖి, 1098-చైల్డ్ హెల్ప్ లైన్, వివిధ హెల్ప్ లైన్‌ల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులకు పింఛన్ రాకపోయినా, ఇంట్లో పిల్లలు తల్లిదండ్రులను బాగా చూసుకోకపోయినా 14567 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వికలాంగుల పించన్లు సదరం సర్టిఫికెట్ల కోసం, ట్రై సైకిల్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే 155326 హెల్ప్ లైన్‌కు సంప్రదించాలన్నారు. అలాగే బేటీ బచావో బేటీ పడావో, సుకన్య సమృద్ధి యోజన గురించి, బాల్య వివాహాల వల్ల వచ్చే నష్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ గౌతమి, ఫైనాన్షియల్ లిటరసీ హేమశ్రీ, సఖి లీగల్ అడ్వైజర్ లావణ్య, సఖి సోషల్ వర్కర్ శారద, ఎస్‌హెచ్‌జీ అధ్యక్షురాలు రాధ, ఎస్‌హెచ్‌జీ మెంబర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మహిళా సాధికారత బృందం సభ్యులు